TGTEL/26/A5513

# వార్త దీపిక

ప్రచురణ : హైదరాబాద్ సంపుటి : 01 సంచిక: 57 05 శనివారం సెప్టెంబర్ 2026 వెల: 02

## కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు లేదు..

● తెలంగాణ మంత్రి

వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, సెప్టెంబర్4వార్త దిపీక న్యూస్ :**

కాంగ్రెస్ పార్టీలో ఎక్కడా వర్గపోరు లేదని, నాయకులంతా ఏకతాటిపై నిలిచి పార్టీ బలోపేతంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నారని తెలంగాణ మంత్రి వివేక్ వెంకట స్వామి స్పష్టం చేశారు. మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా పలు సంక్షే మ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అనంతరం మీడి యాతో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నేతృ త్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నో చారిత్రాత్మక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజాదరణ పొందిందని వెల్లడించారు.

## భారత్ మమ్మల్ని ముందే హెచ్చరించింది...

● రాజకీయ ఒత్తిడికీ గురయ్యే పరిస్థితి వచ్చింది

● బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్4వార్త దిపీక న్యూస్ :**

చైనాపై ఎక్కువగా ఆధారపడిన యూరప్.. ఇప్పుడు దాని ప్రభావాలను ఎదుర్కొంటోందని బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ అన్నారు. ఈ విషయంలో భారత్ మమ్మల్ని ఎప్పుడో హెచ్చరించిందని, అప్పట్లో తాము పట్టించుకోలేదని ఆయన అంగీకరించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కి వచ్చిన బార్ట్ డి వెవర్..



...మిగతా 2 లో...

## కొండా సురేఖను తొలగించారు..

### పొంగులేటి సంగతి ఏమిటి?:

### బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు

**హైదరాబాద్,సెప్టెంబర్3వార్త దిపీక న్యూస్ :**



తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు. సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బందీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

## సురేఖను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం

● రాజగోపాల్‌రెడ్డిని కూడా బీఆర్ఎస్‌లోకి తీసుకోం

● మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్4వార్త దిపీక న్యూస్ :**

మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో తెలంగాణ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఆమె బీఆర్ఎస్ లో చేరుతారని ఓవైపు, బీజేపీలో చేరుతారని మరోవైపు పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సురేఖ కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరవచ్చునే ప్రచా రాన్ని ఆయన తీవ్రంగా ఖండి ంచారు. కొండా సురేఖను బీఆర్ఎస్‌లోకి రానిచ్చే ప్రసక్తే లేదని, ఆమెను ఆఖరికి తెలంగాణ భవన్ గేటును కూడా తాకనివ్వబోమని తేల్చిచెప్పారు.



## సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్...

● కేసు నమోదు చేసిన సైబర్‌క్రైమ్ పోలీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్4వార్త దిపీక న్యూస్ :**

సాధారణంగా ముఖ్యమంత్రులకు భద్రత చాలా కట్టుదిట్టంగా ఉంటు ంది. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటించిన సమయంలో బందోబస్తుకు సంబం ధించిన అత్యంత రహస్య వివరాలను సోషల్ మీడియాలో బహిర్గతం చేసిన ఘటనలో కేసు నమోదైంది. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ టూర్ భద్రతా వివరాలను పోస్ట్ చేసినందుకుగానూ తెలుగు స్క్రైబ్ ఎక్స్ ఖాతా నిర్వాహకులపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

...మిగతా 2 లో...



## రేవంత్ రెడ్డిని ఆపకపోతే మీరు ఇంట్లో కూర్చోవాల్సిందే

● బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు నేను ముందే చెప్పాను..

● ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్4వార్త దిపీక న్యూస్ :**

"కేసీఆర్‌కు ముందే చెప్పాను. రేవంత్ రెడ్డిని ఆపకపోతే మీరు ఇంట్లో కూర్చో వాల్సిందే" అని ఎంఐఎం నేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం సైదాబాద్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ.. తాము గతంలో బీఆర్ ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చా మని, అది నిజం అన్నారు. కానీ తాను పదే పదే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కూడా చెబుతూనే ఉండేవాడినన్నారు.

...మిగతా 2 లో...



## సోషల్ మీడియా పోస్టులతో మాకు సంబంధం లేదు

### సోషల్ మీడియా వేదికలపై కొండా సురేఖ ఆగ్రహం

**హైదరాబాద్, సెప్టెంబర్4(వార్త దిపీక న్యూస్ :**

తెలంగాణ కేబినెట్ నుంచి ఉద్వాసనకు గురైన కొండా సురేఖ, తన పేరుతో సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తన కుటుంబానికి సంబంధం లేని కొన్ని పోస్టులు వివిధ సోషల్ మీడియా వేదికలపై సర్క్యులేట్ అవుతున్నాయని, వాటితో తమకు ఎలాంటి సంబంధం లేదని శుక్రవారం ఆమె 'ఎక్స్' వేదికగా స్పష్టం చేశారు. "త్వరలో బిగ్ అప్‌డేట్", "నిరీక్షణకు తెరపడనుంది" వంటి వ్యాఖ్యలతో ఉన్న పోస్టులు తన దృష్టికి వచ్చాయని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు. తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను సైతం ఆమె పంచుకున్నారు. మంత్రి పదవి నుంచి తనను తొలగించిన మరుసటి రోజే ఈ ప్రచారం జరగడం గమనార్హం. క్రమశిక్షణా రాహిత్యం ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం కొండా సురేఖను కేబినెట్ నుంచి తొలగిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆమోదం పొందిన తర్వాతే సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. గత రెండు, మూడు రోజులుగా ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లతో సహా రాష్ట్ర నాయకత్వంతో అధిష్ఠానం జరిపిన సంప్రదింపుల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. గత నెలలో వరంగల్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో కొండా సురేఖ కుమార్తె సుస్మిత, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేశారు. సీఎం కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు కూడా చేశారు. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికే ఓటు వేయాలని సీఎం పిలుపునివ్వడంపై ఆమె ఆగ్రహం

## కేబినెట్‌లోకి రాములమ్మ..!?



**మంత్రి పదవి కోసం హైకమాండ్‌తో చర్చలు సుముఖంగా ఉన్న కాంగ్రెస్ అధిష్ఠానం!**

**హైదరాబాద్, సెప్టెంబర్4వార్త దిపీక న్యూస్ :**

తెలంగాణ రాజకీయాల్లో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన నేపథ్యంలో ఆమె స్థానంలో మరో మహిళా నేతను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశంపై కాంగ్రెస్ హైకమాండ్ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సినీ నటి విజయశాంతి పేరు తెరపైకి వచ్చింది. ఆమె మంత్రి పదవి కోసం హైకమాండ్‌తో చర్చలు జరుపుతున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంతో ప్రస్తుతం రేవంత్ రెడ్డి కేబినెట్‌లో సీతక్క ఒక్కరే మహిళా మంత్రిగా ఉన్నారు.

...మిగతా 2 లో...

TGTEL/26/A5513 వార్త దీపిక

# కేబినెట్‌లోకి రాములమ్మ..!?

మొదటిపేజీ తరువాయి

దీంతో సురేఖ స్థానంలో మరో మహిళా నేతకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ తరఫున పలువురు మహిళా ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ.. విజయశాంతికి అవకాశంఇవ్వాలనే ఆలోచన రాష్ట్ర నాయకత్వంలో ఉన్నట్లు తెలుస్తోంది. పాలకుర్తి ఎమ్మెల్యే మమిడాల యశస్వినీ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాజకీయాల్లో ఫైర్‌బ్రాండ్ నేతగా విజయశాంతి గుర్తింపు పొందారు. గతంలో బీఆర్ఎస్‌లో ఎంపీగా పనిచేసిన ఆమెకు ఆ పార్టీ రాజకీయాలు, నేతల వ్యవహారశైలిపై మంచి అవగాహన ఉందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనే విషయంలో విజయశాంతి వంటి బలమైన వాయిస్ కేబినెట్‌లో ఉంటే పార్టీకి ప్రయోజనం చేకూరుతుందని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంతో పాటు ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా సమాధానం ఇవ్వగల నేతగా ఆమెను పరిగణిస్తున్నట్లు సమాచారం. మంత్రి పదవిపై చర్చల నేపథ్యంలో విజయశాంతి ఢిల్లీకి వెళ్లనున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. హైకమాండ్ పెద్దలను కలిసి తన రాజకీయ భవిష్యత్తు, మంత్రి పదవిపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ విజయశాంతికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. పార్టీపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేయకుండా.. అప్పుడప్పుడు రాజకీయ అంశాలపై తనదైన శైలిలో స్పందిస్తూ వస్తున్నారు. దీంతో ఆమెకు మంత్రివర్గంలో అవకాశం ఇస్తే పార్టీకి మరింత బలమైన స్వరం లభిస్తుందని రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. అన్నింటికంటే ఆసక్తికరంగా.. విజయశాంతి కేబినెట్‌లో చేరితే హోంశాఖ కావాలని కోరుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. మరోవైపు కేబినెట్‌లోకి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను తీసుకునే అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే కేబినెట్‌లో రెండు ఖాళీలు ఉండగా.. తాజాగా కొండా సురేఖ బర్తరఫ్‌తో మొత్తం ఇద్దరు లేదా ముగ్గురు కొత్త ముఖాలను మంత్రివర్గంలోకి తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు సీనియర్ మంత్రుల శాఖలను మార్చే అవకాశాలపై కూడా కాంగ్రెస్ నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే విజయశాంతికి నిజంగానే మంత్రి పదవి దక్కుతుందా.. దక్కితే ఆమె కోరుకుంటున్న హోంశాఖనే కేటాయిస్తారా.. అనే అంశాలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దీనిపై కాంగ్రెస్ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# సురేఖను తెలంగాణ భవన్ గేటు కూడా తాకనివ్వం

మొదటిపేజీ తరువాయి

పార్టీని వీడి అధికార కాంగ్రెస్‌లోకి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకోబోమని.. వారిలో ఒకరిద్దరికి తప్ప మిగతా ఎవరికీ గులాబీ తలుపులు తెరిచేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో, కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నారంటూ ఆయన సరికొత్త బాంబు పేల్చారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై కూడా జగదీశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజగోపాల్ రెడ్డి దరఖాస్తు చేసుకున్నా ఆయనను బీఆర్ఎస్‌లోకి తీసుకోమని చెప్పారు. ఒకవేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆయనకు మంత్రి పదవి కట్టబెడితే అది పూర్తిగా డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని సంచలన ఆరోపణలు చేశారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన తీవ్ర ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేసిన ఆయన... రాబోయే శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ వైఫల్యాలను, ముఖ్యంగా 22ఏ భూముల స్కామ్‌ను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పక్కా వ్యూహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్నా.. ఆయనను తమ పార్టీలోకి తీసుకోబోమని జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి సోదరులు బీఆర్ఎస్‌లోకి రావాలని ప్రయత్నాలు చేశారని పేర్కొన్న మాజీ మంత్రి.. అయినప్పటికీ ఆ ప్రయత్నాలను తమ పార్టీ తిరస్కరించిందని గుర్తుచేశారు. రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే డబ్బులకు అమ్ముడుపోయినట్లేనని జగదీశ్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గతంలో పలువురు నేతలు బీఆర్ఎస్‌పై, పార్టీ నాయకత్వంపై నేరుగా విమర్శలు చేశారని.. అలాంటి వారిని తిరిగి పార్టీలోకి తీసుకునే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించిన జగదీశ్‌రెడ్డి.. సంచలన వ్యాఖ్యలు చేశారు. బర్తరఫ్ చేయాల్సింది కొండా సురేఖను కాదని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సీఎం పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వంపై కొండా కుటుంబం అవినీతి ఆరోపణలు చేసిందని.. వాటిపై చర్యలు తీసుకోకుండా కొండా సురేఖపై చర్యలు తీసుకున్నారని జగదీశ్ రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి, కుంభకోణాలకు పాల్పడుతోందని తాము ఇప్పటికే కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఆధారాలు పంపించామని పేర్కొన్నారు. అయితే ఇవన్నీ బీఆర్ఎస్ నేత చేసిన ఆరోపణలేనని, వాటిపై సంబంధిత సంస్థల అధికారిక నిర్ధారణ వెలువడలేదని గమనించాలి.కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులుగా ప్రజలను మోసం చేస్తోందని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఆ పార్టీ తీవ్ర అంతర్గత సంక్షోభంలో ఉందని విమర్శించారు. తెలంగాణలో ప్రస్తుతం గోదావరి, కృష్ణా నదుల్లో నీటి లభ్యత ఉన్నందున కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో జరిగిన ఈడీ సోదాలపై కూడా ఆయన ప్రశ్నలు సంధించారు. ఆ దాడులపై ఈడీ ఎందుకు స్పష్టమైన ప్రకటన చేయలేదని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ మంత్రులకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మద్దతు ఉందని ఆరోపించారు. శాసనసభ ఎథిక్స్ కమిటీ నిజాయితీగా వ్యవహరించాలని జగదీశ్‌రెడ్డి కోరారు. పార్టీలు మారిన ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల నాటికి పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరగకపోయినా.. రెండు తెలుగు రాష్ట్రాల్లో డీలిమిటేషన్ జరిగే అవకాశం ఉందని జగదీశ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఏపీలో చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, డీలిమిటేషన్ ద్వారా ఆ రాజకీయ పరిస్థితి నుంచి బయటపడవచ్చని చంద్రబాబు భావిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

# కేసీఆర్ చాలా మంచోడు

## హుందాగా రిసీవ్ చేసుకునేవారు

## కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు

వార్త దీపిక న్యూస్ :

: మంత్రివర్గం నుంచి బర్తరఫ్‌కు గురైన కొండా సురేఖ వరుస ఇంటర్వ్యూలతో కాంగ్రెస్ సర్కార్‌పై, పార్టీ అంతర్గత పరిణామాలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్రముఖ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆమె ప్రశంసల వర్షం కురిపించడం... ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కేసీఆర్ వ్యవహారశైలి ఎలా ఉండేదన్న ప్రశ్నకు సురేఖ స్పందిస్తూ... "కేసీఆర్ గారు చాలా మంచి వ్యక్తి. తమను ఎప్పుడు కలిసినా ఎంతో గౌరవంగా, హుందాగా రిసీవ్ చేసుకునేవారు" అని కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీలో పనిచేసినన్ని రోజులు కేసీఆర్‌తో తమకు ఎలాంటి విభేదాలు రాలేదని స్పష్టం చేశారు. తమ కుటుంబం అడిగిన వెంటనే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తుచేసుకున్నారు. నాడు కొండా మురళికి ఎమ్మెల్సీ పీఠం దక్కకుండా పార్టీలోని కడియం శ్రీహరి వంటి కొందరు సీనియర్ నేతలు అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారని, కానీ కేసీఆర్ స్వయంగా జోక్యం చేసుకుని మిగిలిన వారి నామినేషన్లను ఉపసంహరింపజేసి మురళి ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చూశారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి తీవ్ర అసంతృప్తితో, బర్తరఫ్ వేటుతో బయటకు వచ్చిన కొండా సురేఖ.. కేసీఆర్ పాలనను, ఆయన వ్యక్తిత్వాన్ని పొగడ్తలతో ముంచెత్తడం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందనే విశ్లేషణలు మొదలయ్యాయి. కేసీఆర్‌పై సురేఖ చేసిన సానుకూల వ్యాఖ్యల నేపథ్యంలో కొండా దంపతులు కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి... బీఆర్ఎస్‌లో చేరే అవకాశం ఉందా? అనే ప్రచారం జోరందుకుంది.



# రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి.

## మల్లికార్జున్ ఖర్గే ని అవమానించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## కుల వివక్షకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ పోరాడుతోంది

## ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్

వార్త దీపిక న్యూస్ :

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేరిపై కుల వివక్షకు పాల్పడిన ఘటనను ప్రశ్నించిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పై కేంద్ర ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిజాంసాగర్ చౌరస్తా నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి , డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ. దేశంలో కుల వివక్షకు, అంటరానితనానికి, మనిషిని మనిషిగా తక్కువ చేసి చూసే విధానాలకు స్థానం లేదన్నారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని గంగా జలాలతో శుద్ధి చేశారంటూ వచ్చిన ఘటన తీవ్రంగా ఖండించదగినదని అన్నారు. ఖర్గే ఒక దళిత నాయకుడు కావడం వల్ల ఆయన పాల్గొన్న ప్రదేశాన్ని శుద్ధి చేయాల్సిన పరిస్థితి వచ్చిందని భావించడం అత్యంత దురదృష్టకరం. ఇది కేవలం ఖర్గే ని అవమానించడం కాదు.. రాజ్యాంగాన్ని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను అవమానించడమే అని షబ్బీర్ అలీ అన్నారు. కులం మనిషి పుట్టుకను నిర్ణయించవచ్చు కానీ అతని గౌరవాన్ని నిర్ణయించదు. ప్రతి భారతీయుడికి ఆత్మగౌరవంతో జీవించే హక్కు ఉంది. రాజ్యాంగం ఇచ్చిన సమానత్వాన్ని ఎవరూ కాలరాయలేరుఅని అన్నారు. ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గొంతును అక్రమ కేసులతో అణచివేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని షబ్బీర్ అలీ ఆరోపించారు. ప్రజల తరఫున ప్రశ్నించడం రాహుల్ గాంధీ హక్కు. ప్రశ్నించే గొంతును కేసులతో భయపెట్టాలని చూస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరింత బలంగా ప్రజల మధ్య నిలబడతారు. రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి" అని డిమాండ్ చేశారు.ఖర్గే ని అవమానించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కేసీఆర్ ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ ఇప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారు. ప్రజల కోసం పనిచేయని నాయకుడికి ప్రతిపక్ష నాయకుడి పదవి ఎందుకు ప్రజల సమస్యలను పట్టించుకోని కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నాయకుడి పదవికి రాజీనామా చేయాలి" అని షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. కామారెడ్డి ప్రజలను కేసీఆర్ క్షమాపణ కోరాలని అన్నారు. కామారెడ్డి నుంచి పోటీ చేసిన కేసీఆర్.. ఈ ప్రాంత ప్రజలకు ఏం చేశారు వారి సమస్యల గురించి అసెంబ్లీలో ఏం మాట్లాడారు ప్రజలకు చెప్పాలి. వరదలు, భారీ వర్షాలతో ప్రజలు తీవ్రంగా నష్టపోయిన సమయంలో బాధితులను పరామర్శించడానికి కూడా కేసీఆర్ రాలేదు. కేటీఆర్ రాలేదు. బీఆర్ఎస్ నాయకత్వం ప్రజల పక్కన నిలబడలేదు" అని విమర్శించారు. "బీఆర్ఎస్ ఖాతాలో వందల కోట్ల రూపాయల నిధులు ఉన్నాయని చెబుతున్నారు. కామారెడ్డిలో పోటీ చేసిన కేసీఆర్ ఆ నిధుల నుంచి ఈ ప్రాంత ప్రజలకు ఎంత సహాయం చేశారు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా. ప్రజలు దీనిపై సమాధానం కోరుతున్నారు" అని షబ్బీర్ అలీ ప్రశ్నించారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల మన్ననలు పొందుతున్నాయని షబ్బీర్ అలీ అన్నారు

# సీఎం సెక్యూరిటీ సమాచారం లీక్...

మొదటిపేజీ తరువాయి

సీఎం రేవంత్ ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టారు. మొదట ఈ ఫిర్యాదుతో జులై 14న ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ (క్రైమ్స్) ఆదేశాల మేరకు సమగ్ర విచారణ కోసం ఈ కేసును సిటీ సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేసి రీ-రిజిస్టర్ చేశారని సమాచారం. సీఎం రేవంత్ ప్రధాన భద్రతాధికారి (సీఎస్‌వో) కేబీ ఫ్రాంక్లిన్ ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 13న సీఎం రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటనకు సంబంధించిన నిమిషాల వారీ పూర్తి షెడ్యూల్, భద్రతా ఏర్పాట్లపై ఢిల్లీ పోలీస్ జాయింట్ కమిషనర్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, ఆర్‌జీఐఏ, డీజీపీ వంటి ఉన్నతాధికారులకు ఒక వైర్‌లెస్ సందేశం ద్వారా సమాచారం పంపాం. జెడ్ ప్లస్ (ం) కేటగిరీ భద్రతకు అనుగుణంగా చేసిన ఈ ఏర్పాట్ల సందేశంలో సీఎం బ్లడ్ గ్రూప్, సీఎస్‌వో ఫోన్ నంబర్ వంటి అత్యంత సున్నితమైన అంశాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఢిల్లీలో పర్యటన కొనసాగుతుండగానే ఈ అత్యంత రహస్య వైర్‌లెస్ సమాచారాన్ని తెలుగు స్క్రైబ్ అనే ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయడంతో సీఎం రేవంత్ రెడ్డి భద్రతాపరమైన వివరాలన్నీ బహిర్గతమయ్యాయి. నిబంధనల ప్రకారం వైర్‌లెస్ సందేశాలను బయటకు పొక్కనివ్వకూడదు. అయితే అధికారుల్లో ఎవరైనా అక్రమంగా ఈ సమాచారాన్ని ఆ సోషల్ మీడియా ఖాతాకు చేరవేసి ఉంటారని సీఎస్‌వో తన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. ఈ విధి నిర్వహణలో తలెత్తిన లోపం, సీఎం రేవంత్ భద్రతా ఉల్లంఘనపై క్షుణ్ణంగా దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. జూన్ 14న ఖైరతాబాద్ పీఎస్‌లో కేసు నమోదుకాగా, సమగ్ర దర్యాప్తు కోసం సైబర్ క్రైమ్ విభాగానికి కేసు బదిలీ చేసి రీ రిజిస్టర్ చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

# రేవంత్ రెడ్డిని ఆపకపోతే మీరు ఇంట్లో కూర్చోవాల్సిందే

మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోండి.. లేకపోతే మీరంతా ఇళ్లలోనే కూర్చోవాల్సి వస్తుందని చెప్తుండేవాడనన్నారు. "ఇప్పుడు ముఖ్యమైన విషయం ఏమిటంటే... సీఎం సాబ్, మీరు కాస్త మరీ ఎక్కువ మర్యాదస్తుడిగామారిపోయారు. కాస్త మీ పాత దూకుడు చూపించండి, ప్రజల్లోకి రండి. మిమ్మల్ని ఏ విషయం ఆపుతోందో నాకైతే అర్థం కావడం లేదు. హనుమంతరావు సాబ్, మీరేమైనా చెబుతారా వచ్చి? నేను చెప్పింది తప్పు కాదు కదా? మీరు కూడా నాతో ఏకీభవిస్తున్నారు కదా... మీరు ఒప్పుకుంటున్నారు... మీరొక సీనియర్ నాయకులు, మీరే ఒప్పుకున్నారంటే ఇక అంతే, నేను సరైన మాటే చెప్పాను. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో హైదరాబాద్ మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోవాలని, యావత్ తెలంగాణ రాష్ట్రం సంపూర్ణ ప్రగతి సాధించాలని మేము మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము" అని ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఆయన సోదరుడు, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీపై ప్రశంసలు కురిపించారు. దేశభక్తి విషయంలో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ఓవైసీ ఏమీ తక్కువ కాదన్నారు. అసదుద్దీన్ ఓవైసీ, ఎంఐఎం దేశానికి వ్యతిరేకమనే ప్రచారం కేవలం కొందరి దుష్ప్రచారం మాత్రమేనన్నారు. సైదాబాద్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చకు దారి తీశాయి. అసదుద్దీన్ ఓవైసీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. తాను సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్బరుద్దీన్ ఓవైసీ, అసదుద్దీన్ ఓవైసీలతో కలిసి పాతబస్తీ అభివృద్ధిపై చర్చించినట్లు చెప్పారు. గతంలో ఎంతమంది సీఎంలు ఓల్డ్ సిటీకి వచ్చారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. పాతబస్తీ అభివృద్ధికి అసదుద్దీన్ ఓవైసీ ఏ ప్రతిపాదన తీసుకొచ్చినా పరిశీలించి నిధులు మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తున్నట్లు చెప్పారు.

# భారత్ మమ్మల్ని ముందే హెచ్చరించింది...

మొదటిపేజీ తరువాయి

ఢిల్లీలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. తక్కువ ధరలకే విదేశీ వస్తువులు యూరప్ మార్కెట్‌లోకి భారీగా రావడం వల్లే అక్కడి స్థానిక పరిశ్రమంలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. గడిచిన కాలం యూరప్‌కు ఒక మేలుకొలుపు. చాలా కాలంగా తక్కువ ధరలకు భారీగా వస్తువులు మా మార్కెట్‌లోకి వచ్చాయి. దాంతో మా పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి పెరిగింది. చివరికి ఆ ఆధారపడటాన్నే రాజకీయ ఒత్తిడికి ఉపయోగించే పరిస్థితి వచ్చింది" అని డివెవర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన నేరుగా చైనా పేరును ప్రస్తావించలేదు, కానీ చైనా నుంచే యూరప్ మార్కెట్‌లోకి చౌకధరల వస్తువులు రావడంతో.. ఆయన చైనాను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేసినట్లు అందరికీ అర్థమవుతోంది. "మే గుర్తించకముందే భారత్ ఈ ప్రమాదాన్ని చూసింది. మమ్మల్ని హెచ్చరించింది. కానీ మేమే వినలేదు" అని డి వెవర్ ఒప్పుకొన్నారు. ఒక దేశంపై ఆర్థికంగా ఎక్కువగా ఆధారపడటం భవిష్యత్‌లో రాజకీయ ఒత్తిడికి కారణమయ్యే అవకాశం ఉందని ఇప్పుడు యూరప్ గుర్తించిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ కూడా యూరప్‌ను చాలా కాలం కిందటే హెచ్చరించారని గుర్తు చేశారు. మీ ప్రధాని చాలా కాలం కిందటే యూరప్‌ను హెచ్చరించారు. కానీ అప్పట్లో ఎవరూ ఆయన మాట వినలేదు. ఇప్పుడు మేం వింటున్నాం" అని బెల్జియం ప్రధాని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌ను అత్యంత ముఖ్యమైన, నమ్మకమైన భాగస్వామిగా బెల్జియం చూస్తోందన్నారు. అదేవిధంగా పాకిస్థాన్‌కు కీలకమైన సైనిక సామగ్రి ఇవ్వబోమంటూ ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోదీ - బార్ట్ డి వెవర్ సమావేశాల సందర్భంగా భారత్ - బెల్జియం రక్షణ రంగ సంస్థల మధ్య పది ఒప్పందాలు కుదిరాయి.

# కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు లేదు..

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన 22ఏ నిరోధిత భూముల వివాదంపై మంత్రి స్పందిస్తూ... ఈ సమస్య ముమ్మాటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాల వల్లే ఉత్పన్నమైందని మండిపడ్డారు. ఆనాటి జీవోను పునఃపరిశీలించి, సవరణలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందని, ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా నిరోధిత జాబితా చిక్కులను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రతికూలంగా ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నిబద్ధతతో నెరవేరుస్తున్నామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలు, డిజైన్ లోపాల వల్లే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ఆరోపించిన మంత్రి వివేక్, ఈ వైఫల్యంపై మాజీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ప్రజలకు బహిరంగ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు ఉనికి కోసమే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, గత పదేళ్ల స్వార్థ పాలనను ప్రజలు ఇంకా మరచిపోలేదని ఆయన వ్యాఖ్యానించారు.

TGTEL/26/A5513
వార్త దీపిక

# కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ తట్టుకోలేరు.





## వృద్ధులు, మహిళలు, వికలాంగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..?

## పథకాలు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 5, వార్త దిపీక న్యూస్ :**

ఎన్నికల ముందు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు ఆ హామీల అమలులో "మాటలు కోటలు దాటుతున్నాయని, చేతలు గడప దాటడం లేదు" అన్న చందంగా వ్యవహరిస్తోందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నిరసన ధర్నా నిర్వహించింది.

**కేసీఆర్ వస్తే రేవంత్‌కు తట్టుకోలేరు..?**

అసెంబ్లీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అడుగుపెడితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పలేని పరిస్థితి వస్తుందని బీఆర్ఎస్ చింత ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే హరీశ్‌రావు, కేటీఆర్ సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటేనే ముఖ్యమంత్రి, మంత్రులు "నోట్లో నాలుక లేనట్టుగా.. సమాధానం కోసం తడబడుతున్నారని" ఎద్దేవా చేశారు. చెప్పేది శ్రీరంగనీతులు.. చేసేది తలకిందుల పనులు" అన్నట్టుగా కాంగ్రెస్ పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా ఎదురుదాడికి దిగడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

**వృద్ధులకు రూ.4,000 పింఛన్ హామీ ఏమైంది..?**

ఎన్నికల సమయంలో వృద్ధులకు నెలకు రూ.4,000 పింఛన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా వృద్ధులను నిరాశకు గురిచేస్తోందని ఆరోపించారు. మాట ఇచ్చి మడమ తిప్పడం ప్రజలకు ఆమోదయోగ్యం కాదని పేర్కొంటూ, వృద్ధులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చాక హామీలను పక్కన పెట్టడం సరికాదని విమర్శించారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులు కాంగ్రెస్‌పై నమ్మకంతో ఓటు వేశారని, ఇప్పుడు అదే ప్రజలకు ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేసే వరకు పోరాటం ఆగదులి" వృద్ధులకు రూ. 4,000 పింఛన్, మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సహాయం, వికలాంగులకు రూ. 6,000 పింఛన్ వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ టిఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ళ రాజేందర్ రెడ్డి, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి, జుబేదా, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు..!

### ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సంగారెడ్డి, సెప్టెంబర్ 5, వార్త దిపీక న్యూస్ :**

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో మురళీకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలత, ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధా వేషధారణలో అలరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. కార్యక్రమ ప్రాంగణం భక్తి శ్రద్ధలతో సందడిగా మారింది. కృష్ణాష్టమి సందర్భంగా శ్రీకృష్ణుడి జీవిత సందేశాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని, ధర్మం, సత్యం, మానవత్వం వంటి విలువలను ఆచరించాలని సూచించారు. ప్రజలందరికీ శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, నిర్వాహకులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా వాసవి దేవాలయ, శిఖర యంత్ర ప్రతిష్టాపన వేడుకలు..!





**సంగారెడ్డి, సెప్టెంబర్ 5, వార్త దిపీక న్యూస్ :**

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ శిఖర, యంత్ర స్థాపన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. దేవాల కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి వైదిక నిర్వహణలో ప్రతిష్టాపన కార్యక్రమాలు వైభవవోతంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం అందరూ సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయానికి ఆర్యవైశ్యులతో పాటు అన్ని కులాలు కూడా రావాలని కోరారు. ఆలియా అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు ఆమేటి పాండయ్య, కార్యదర్శి ఇల్లింతల రాజు, కోశాధికారి జూలకంటి మల్లేశం, ఉపాధ్యక్షుడు మ్యాడం రాధాకిషన్, అమేటి మహేందర్, కార్యనిర్వక కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్, ఆలయ కమిటీ సభ్యులు జూలకంటి బుచ్చలింగం, సరఫ్ భు కుమార్, పుల్లూరి ప్రకాష్, గుండ్లపల్లి నరేష్ కుమార్, అమేటి భాస్కర్, కిట్టు, నామ భాస్కర్ పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**సంగారెడ్డి, సెప్టెంబర్ 5, వార్త దిపీక న్యూస్ :**



శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో గణేష్ నగర్ లో గల మురళీకృష్ణ ఆలయంలో వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. శుక్రవారం ఉదయం స్వామివారికి అభిషేకం, విష్ణు సహస్రనామార్చన, అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా శ్రీ అయ్యప్ప భజన మండలి ఆధ్వర్యంలో భజన సంకీర్తన కార్యక్రమం వైభవంగా జరిగింది. చిన్నారుల రాధాకృష్ణ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తి పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో దేవాలయ ప్రాంగణం మార్మోగిపోయింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, సభ్యులు పాండురంగం, మల్లారెడ్డి, సహదేవ్, సభ్యులు భక్తులు వేల సంఖ్యలో హాజరయ్యారు.




# రేజింగ్ స్టార్ ప్లే పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు..!

## అంగరంగవైభవంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి సంబరాలు

### ఆకట్టుకున్న చిన్నారుల ఆట పాట

**సంగారెడ్డి, సెప్టెంబర్ 5, వార్త దిపీక న్యూస్ :**

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని రేజింగ్ స్టార్ ప్లే పాఠశాలలో శుక్రవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ప్రార్థన అనంతరం విద్యార్థులు కృష్ణుని భజనలు, పాటలు పాడడం జరిగింది. తరువాత ఉట్టి కొట్టే కార్యక్రమంలో వీరభద్ర విద్యాలయం యాజమాన్యం కృష్ణాష్టమి విశిష్టతను వివరించారు. కృష్ణ, బలరాములు, యశోద, గోపికల వేషధారణలో విద్యార్థులు చూపరులను ఆకట్టుకున్నారు. విద్యార్థుల కోలాటం, అభినయ గేయాలు, చెక్క భజన, ఘోష్, నృత్యాలు ఎంతో ఉత్సాహంతో చేయగా అందరూ జై శ్రీకృష్ణ అంటూ కేరింతలు కొట్టిన అనంతరం పాఠశాల కరస్పాండెంట్, పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ప్రతీ సంవత్సరం ఎంతో ఆనందంగా జరుపు కోవడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. దుష్ట శిక్షణ ధర్మ రక్షణ కోసం శ్రీ











# హుజురాబాద్ లో ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికలు

**హుజురాబాద్, సెప్టెంబర్ 04వార్త దిపీక న్యూస్ :**

హుజూరాబాద్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికలు ఘనంగా జరిగాయి. కరీంనగర్ జిల్లా హుజురాబాద్ లో డివిజనల్ నాయకులు వామన్ రావు, బసవేశ్వర్ ల ఆధ్వర్యంలో నిర్వహియగా బి. రవికుమార్, ఎం. వివేక్, కోశాధికారిగా రుద్రారపు కుమార్, జనరల్ కౌన్సిల్ మెంబర్గా బొంకూరి కుమార్ ఎన్నుకోబడ్డారు. ఈసీ మెంబర్లుగా రుషితరెడ్డి, అనిల, గోపికిషోర్, గోరెమియా, ఆశిష్‌వర్ధన్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి నాయకులు, తోటి ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

TGTEL/26/A5513
వార్త దీపిక

# ఘనంగా కొరివి కృష్ణస్వామి జయంతి వేడుకలు..!

**జహీరాబాద్, సెప్టెంబర్ 5,వార్త దీపిక న్యూస్ :**

కొరివి కృష్ణ స్వామి ముదిరాజ్ జయంతిని పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణం, మండల పరిధిలోని హోతి (కె) గ్రామంలో ముదిరాజ్ సంఘం నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తాలూకా పట్టణ అధ్యక్షులు, సభ్యులు పాల్గొని హైదరాబాద్ తొలి మేయర్ అయినటువంటి బడుగుల ఆశాజీవి కొరివి కృష్ణ స్వామి జయంతిలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు శంకర్, రమేష్, ఆడివన్న లు మాట్లాడుతూ తన జీవితంలో ముదిరాజుల యొక్క ఔన్నత్యానికి, ఆర్థిక, సామాజిక, అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, కొరివి కృష్ణ స్వామి ఉన్నత చదువులు చదివి పత్రిక సంపాదకుడుగా ముదిరాజ్ సంఘం ఎదుగుదలకు కృషి చేశారని తెలిపారు. పట్లోల గోపాల్ మాట్లాడుతూ ప్రతి ముదిరాజ్ బిడ్డలు విద్యావంతులుగా ఎదిగి దేశభివృద్ధిలో ముందు ఉండాలని తెలిపారు. హోతి కే అధ్యక్షులు బోయిని అడివన్న మాట్లాడుతూ కొరివి కృష్ణ సంఘానికి ఎన్నో సేవలు చేశారని తెలిపారు. కొరివి కృష్ణ జయంతిని ఇదేవిధంగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మహేష్, ముదిరాజ్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.





# ధర్నా వోద్దనోళ్లే ధర్నా చేస్తుండ్రు..?







ధర్నా చౌక్ ఎత్తేసింది
బిఆర్ఎస్ కాదా..

ఆరోజు ధర్నా వద్దు..! ఈ రోజు
ధర్నా ముద్దా..

వెయ్యి రోజుల కాంగ్రెస్
పాలనపై చర్చ సిద్ధమే..!

ఫామ్ హౌజ్ పాలన కాదు...
కాంగ్రెస్ పార్టీది ప్రజా పాలన..!

బైకు ర్యాలీలో కదనబేరిలో
మల్లన్న పాటిల్

**కోహిర్, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :**

పదేళ్ల కెసిఆర్ హయంలో ఉద్యమకారులపై రాళ్లు రువ్విన చరిత్ర ఏవ్వరు మరిచి పోలేరని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన ఉద్యమకారుల కుటుంబానికి ఉద్యోగం ఇవ్వలేని గత బిఆర్ఎస్ ప్రభుత్వం ధర్నాలు, రాస్తోరోకోలు ఎందుకు చేస్తున్నారని ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు సువర్ణ మల్లన్న పాటిల్ అన్నారు. శుక్రవారం కవెల్లి చౌరస్తా నుండి జహీరాబాద్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ధర్నాలోద్దన్న వద్దని, ఇప్పుడు ధర్నాలు ముద్దు అని ధర్నాలు చేస్తుంటే ప్రజలు నవ్వుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన చేస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు ధర్నా చేస్తున్నారని రామలింగారెడ్డి, మల్లన్న పాటిల్ లు మండిపడ్డారు. తెలంగాణ ప్రజలపై కపట ప్రేమ చూపుతూ ఏడు రోజులు ధర్నా ఎందుకు చేస్తున్నారో ఒక్కసారి ఆత్మ విమర్శన చేసుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్, కోహిర్ పట్టణ అద్యక్షుడు ముజఫర్, కౌన్సిలర్లు జగదీశ్వర్, శీరిష రాణరాణ సీనియర్ నాయకులు శంశూర్ అలీ, కవెల్లి క్రిష్ణ, బ్లాక్ ప్రెసిడెంట్ అర్షద్ అలీ, అష్రఫ్, రాచన్న, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు అశోక్, విద్యా సాగర్, రాజుకుమార్, విష్ణు, అనిల్, దయానంద్ పాటిల్, వీరారెడ్డి, బిచ్చన్న, లాయక్, హైమద్ అలీ, మాజీ ఎంపిటిసిలు, కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# విధ్వంసానికి చిరునామా రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలన..!

నిరుపేదల సంక్షేమ పథకాలను నిలిపివేశారు..!

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమే..! సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తాం..!

అర్ధరాత్రి ఫోన్ చేస్తే.. అందుబాటులో ఉంటా..!

మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

**మర్పల్లి, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :**

ప్రజలు నమ్మి కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం అందిస్తే.. పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తూ విధ్వంస పాలన కొనసాగిస్తోందని మహేశ్వరం శాసన సభ్యులు సబితా ఇంద్రారెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మర్పల్లిలో ఏర్పాటు చేసిన వంట వార్పు నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు, డబుల్ బెడ్ రూమ్ లు, రైతు బందు, కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్, రైతు భీమా వంటి తదితర పథకాలు ఇచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం పేదల సంక్షేమ కోసం వినూత్న పథకాలను ప్రవేశపడితే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రజల జీవితాలతో ఆడుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరమైన సమయంలో ప్రజలకు అండగా నిలబడతామని, అర్ధరాత్రి ఫోన్ చేసిన అందుబాటులో ఉండేందుకు మీ కుటుంబ సభ్యుడిగా తాను ఉంటానని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ భరోసా ఇచ్చారు. రాబోయేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చిన వెంటనే నిలిపివేసిన అన్ని సంక్షేమ పథకాలను పునరుద్ధరించి ప్రజలకు అండగా నిలుస్తామని అన్నారు. పేదల సొంత ఇంటి కలను సాకారం చేసిన కెసిఆర్ రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అవసరమైన సమయంలో మీ శక్తిని చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మధుకార్, మాజీ వైస్. ఎంపిపి మోహన్ రెడ్డి, మర్పల్లి మండల బిఆర్ఎస్ పార్టీ యూత్ అద్యకులు మధుకార్, బుచన్ పల్లి మాజీ సర్పంచ్ జయ దయాకర్, పార్టీ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.





# జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు..!









భజన చేస్తూ ఊరేగింపు..!

ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్న
జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు

**సంగారెడ్డి, సెప్టెంబర్ 5, వార్త దీపిక న్యూస్ :**

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల రామ్ నగర్ రామ్ మందిర్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని రామ్ మందిర్ పరిసర ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. జగ్గారెడ్డి స్వయంగా భజన చేస్తూ భక్తులతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్ మందిర్ ఆవరణలోని శ్రీకృష్ణుడి ఆలయంలో విగ్రహాన్ని ఊయలలో ఉంచి నిర్వహించిన డోలారోహణం కార్యక్రమంలో జగ్గారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాంమందిర్ పురవీధుల్లో భజనలు, కోలాటాలతో 12 ఉట్టి కుండలతో ప్రత్యేక ఊరేగింపు నిర్వహించారు. భక్తుల సందడి నడుమ సాగిన ఈ ఊరేగింపు అనంతరం రామ్ మందిర్ కమాన్ వద్ద సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జగ్గారెడ్డి స్వయంగా ఉట్టి కొట్టి భక్తులను ఉత్సాహపరిచారు. ఈ వేడుకల్లో సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, జగ్గారెడ్డి కుమార్తె జయారెడ్డి, కుమారుడు భరత్ సాయి రెడ్డి పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి గీతాలు, భజనలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలతో రామ్ మందిర్ పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకున్నాయి.